పండ్లలో రారాజు.. మామిడి...

- రుచి, ఆరోగ్యం, జీవనోపాధి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రకృతి ప్రసాదించిన ఫలాల్లో మామిడిని రారాజుగా పిలుస్తారు. వేసవి రాగానే, ఏప్రిల్ నుండి జులై వరకు మార్కెట్లు మామిడి పండ్లతో కళకళలాడతాయి. చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు అందరూ ఇష్టంగా ఆరగించే ఈ పండు రుచి చూడని వారుండరు. సినీగేయ రచయితలు సైతం మామిడి పండుపై మధురమైన పాటలు రచించారు. 'బంగినపల్లి మామిడిపండు రంగు మీద ఉంది అది ఏ తోటలో ఏ పేటదో' అంటూ సాగే పాట మామిడి రుచిని, ప్రాముఖ్యతను చాటుతుంది. మధురమైన వాసన, తియ్యని రుచి కలిగిన మామిడి పండు అందరి మనసులనూ దోచేస్తుంది. ప్రస్తుతం వీధుల్లో, రోడ్ల పక్కన వ్యాపారులు ఆకర్షణీయంగా పేర్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ పండును పండించిన రైతుల కష్టం గురించి చాలా కొద్ది మంది మాత్రమే ఆలోచిస్తారు. వేసవిలో మామిడి పండ్లను అమ్ముకొని జీవనం సాగించే అనేక కుటుంబాలు ఉన్నాయి. రైతులు పండించిన మామిడిని హోల్‌సేల్ వ్యాపారులు కొనుగోలు చేసి, అక్కడి నుండి రిటైల్ వ్యాపారులు తెచ్చుకుని విక్రయిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో మామిడి కాయల సైజును,





మామిడి పండ్లను అమ్ముతున్న వ్యాపారి

నాణ్యతను బట్టి కిలో రూ.120 వరకు ధర పలుకుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కాల్వబుగ్గ, హుసేనాపురం, ఎంబాయి, పెండేకల్లు, డోన్, గోవర్ధనగిరి, బనగానపల్లె, ఎల్ బండ, చాగలమర్రి, పాలకొల్లు, బేతంచెర్ల, ప్యాపిలి, ఓర్వకల్లు, కల్లూరు, దేవనకొండ, తుగ్గలి, కొంగనపాడు, నాయకల్లు, బస్తిపాడు ప్రాంతాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ మామిడి సాగులో మొదటి స్థానంలో ఉండటం విశేషం.

మామిడి చెట్టు - అనేక ప్రయోజనాలు

మామిడి చెట్టు కేవలం పండ్లనే కాదు, అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. హిందువులు పండుగల సమయంలో మామిడి ఆకులను గుమ్మాలకు తోరణాలుగా కట్టి శుభసూచకంగా భావిస్తారు. ఉగాది పచ్చడిలో మామిడి పిందెలను ఉపయోగిస్తారు. మామిడి కాయలతో పచ్చడి, ఊరగాయలు తయారు చేస్తారు.

మామిడి పండు - పోషకాల నిధి

మామిడి పండులో అనేక పోషకాలు ఉన్నాయి. వేసవిలో మామిడి తినడం వల్ల వడదెబ్బ నుండి రక్షణ లభిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు పెరుగు, అన్నంతో కలిపి తీసుకోవడం మంచిది. ఇది రక్తపోటును నియంత్రిస్తుంది, జీర్ణశక్తిని పెంచుతుంది, ఎసిడిటీని తగ్గిస్తుంది. వైరల్ ఇన్ఫెక్షన్లు తగ్గుముఖం పడతాయి, పేగులు శుభ్రమవుతాయి, దంత చిగుళ్ళు బలపడతాయి, చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. ఇందులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, చెమటను తగ్గిస్తుంది.

ఉమ్మడి వ్యాపారం - ఉపాధి మార్గం



రామాంజనేయులు (కర్నూలు వాసవి నగర్), సయ్యద్ బాష గత 20 సంవత్సరాలుగా కలిసి మామిడి వ్యాపారం చేస్తున్నారు. మండి బజార్ హోల్‌సేల్ వ్యాపారుల నుండి బాక్స్‌కు 18 కేజీల చొప్పున 10 బాక్సులు తెచ్చుకుంటారు. సైజును బట్టి ఒక్కో బాక్స్ ధర రూ.600 నుండి రూ.1200 వరకు ఉంటుంది. రోజుకు రూ.12,000 పెట్టుబడి పెడతారు. కొన్ని పండ్లు చెడిపోయినా, తూకంలో కొంత నష్టం వచ్చినా రోజుకు సుమారు రూ.1000 లాభం పొందుతున్నారు. ఆయా సీజన్లలో పండే పండ్లను అమ్ముకొని తమ కుటుంబాలను పోషిస్తున్నారు.

మామిడి ఆకులు - ఆరోగ్య ప్రదాయని

మామిడి ఆకులను నీటిలో మరిగించి తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వీటిలో విటమిన్ బి,ఎ లు ఉంటాయి, ఇవి యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఆకుల డికాషన్ తాగడం వల్ల షుగర్ వ్యాధిని నియంత్రించవచ్చు. రాత్రిపూట ఒక గ్లాసు వేడి నీటిలో నాలుగు ఆకులు వేసి ఉదయం ఆ నీటిని తాగాలి. లేత ఆకులు ఆందోళనను తగ్గిస్తాయి. శరీరాన్ని రిఫ్రెష్ చేస్తాయి, కిడ్నీలలో రాళ్లను తగ్గిస్తాయి. ఆకుల పేస్ట్‌ను పులిపిర్లపై రాస్తే అవి తగ్గిపోతాయి. పేస్టులా చేసి గాయాలపై పెడితే రక్తస్రావం తగ్గుతుంది, జీర్ణశక్తి పెరుగుతుంది, జలుబు, దగ్గు తగ్గుతాయి.

మామిడి రకాలు - రుచుల వైవిధ్యం

ప్రధానంగా బంగినపల్లి, తోతాపురి, ఇంద్రాణి, నీలం, బొప్పాయి, మల్ గోబా, లండ, క్యాన్సర్ బొంబాయి, చిన్న పెద్ద రసాలు, చెరుకు రసం, నీలే షాన్, దసేరి వంటి అనేక రకాలు మనకు అందుబాటులో ఉన్నాయి. మహారాష్ట్రలో ప్రసిద్ధి చెందిన ఆల్ఫోన్సో (హాపూజ్) కూడా ఒక రకమైన మామిడే. మామిడి కాయలతో ఊరగాయ, పులిహోర, పచ్చడి, పప్పు తురుము, పచ్చడి, అల్లం పచ్చడి, మామిడి అల్లం నిలువ పచ్చడి, తొక్కు పచ్చడి వంటి వివిధ రకాల రుచికరమైన ఆహార పదార్థాలు తయారు చేసుకోవచ్చు. ఉప్పు కారం కలిపి తింటే విటమిన్ సి లభిస్తుంది. ఇన్ని ప్రయోజనాలు కలిగిన మామిడిని తప్పక ఆస్వాదిద్దాం!

ఆర్గానిక్ మామిడి - ఆరోగ్యానికి మేలు

- హార్టికల్చర్ ఎడి విజయలక్ష్మి



ఆర్గానిక్ పద్ధతిలో పండించిన మామిడి పండ్లను తినడం ఆరోగ్యానికి చాలా మంచిదని తెలిపారు. కర్నూలు, నంద్యాల ఉభయ జిల్లాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేస్తున్నారు. ఇక్కడ బంగినపల్లి, బెనిషాన్ వంటి రకాలు ముఖ్యమైనవి. బనగానపల్లె, ఎంబాయి ప్రాంతాల్లో పండే పండ్లు మంచి కండ కలిగి, ఒక్కో పండు రెండు కేజీల వరకు బరువు ఉంటుంది. రైతులు ప్రస్తుతం మామిడి కాయలు రాగానే ఫ్రూట్ కవర్లు కడుతున్నారు. దీనివల్ల వర్షం, గాలికి కాయలు రాలకుండా, డ్యామేజ్ కాకుండా ఉంటాయి, పురుగులు కూడా చేరవు. ఆర్గానిక్ పండ్లు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. మన ప్రాంతంలోని చిన్న, పెద్ద ఆచారి కాయలు పచ్చళ్ల తయారీకి ప్రసిద్ధి చెందాయి. ఈ కాయలు మెత్తబడకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.

జిజిహెచ్ సేవలు..

సంతృప్తికరం...

- మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు సర్వజన వైద్యశాల, కళాశాల వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది సేవలు అత్యంత సంతృప్తికరంగా ఉన్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశంసించారు. శనివారం కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లోని అధునాతన పరికరాలను ప్రారంభించిన అనంతరం ఆయన వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ, వైద్య వ్యవస్థ ఒక కుటుంబం లాంటిదని, రాష్ట్ర ప్రజలకు అత్యుత్తమ ఆరోగ్య వ్యవస్థను నిర్మించాలనే లక్ష్యంతో పనిచేయాలని వైద్యులు, సిబ్బందికి పిలుపునిచ్చారు. ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడినప్పుడు వారు వైద్యుల, సిబ్బంది సేవల పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, ఇది తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిం దని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూ.లక్ష నుండి రూ.28 లక్షల విలువైన వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ప్రతి రోగి సంతృ ప్తిగా డిశ్చార్జ్ కావాలని ప్రభుత్వం కోరుకుంటోందని మంత్రి అన్నారు. కర్నూలు ఆస్పత్రిని రాష్ట్రంలోని ఇతర ఆసుపత్రులకు ఆదర్శం గా నిలపాలని, దీనిని "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్"గా తీర్చిదిద్దాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న విలువైన సేవల గురించి మీడియా, సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఆరోగ్యశ్రీ సేవల గురించి ప్రతిపక్షాలు, కొన్ని పత్రికలు అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని, గత ప్రభుత్వం కంటే ఎక్కువ సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. వైద్యుల పట్ల రాజకీయ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, వారిని గౌరవించాల ని మంత్రి సూచించారు. కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రికి త్వరలో పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తామని, క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వం అరకొర నిధులు, సదుపాయాలతో వైద్య కళాశాల నిర్మాణాలు చేపట్టిం దని, నాణ్యమైన వైద్యులు తయారవ్వాలంటే ఉత్తమ మైన బోధకులు, సదుపాయాలు ఉండాలని మంత్రి అన్నారు. అందుకే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం తో మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉచిత సేవలు అందిస్తామని, వైద్య విద్యార్థులకు కూడా ఎటువంటి తేడా ఉండదని తెలిపారు. ఇప్పటికే ప్రారంభమైన ఏడు మెడికల్ కాలేజీల్లో వైద్య సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతిలో నడుస్తున్నాయని ఆయన గుర్తు చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి టిజి.భరత్ మాట్లాడుతూ, కర్నూలు సర్వజన వైద్యశాలకు ఆరు జిల్లాల నుండి రోగులు వస్తున్నారని, ఈ ఆసుపత్రిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్య శాఖ మంత్రిని కోరారు. కర్నూలు మెడికల్ కాలేజీలో చదువుకున్న వైద్యులు దేశ విదేశాల్లో ఖ్యాతి గడించారని, వారు ఈ కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. వైద్యులు కనిపించని దేవుళ్ళని, రోగుల పట్ల ఓర్పు, సహనంతో మాట్లాడితే సగం సమస్యలు తీరిపోతాయని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ, కర్నూలు వైద్య కళాశాలను ఎయిమ్స్ స్థాయికి తీర్చిదిద్దాలని కోరారు. ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆదోని ప్రాంతంలో వైద్య సేవల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎపిఎంఎస్ఐడిసి చైర్మన్ చల్లపల్లి శ్రీనివాస్, అకాడమిక్ డిఎంఇ డాక్టర్ రఘునందన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిరసనాగ్రహం..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లును ఆమోదింపజేసుకుంది. దీనిపై పలు పార్టీలు, సంఘాలు మండిపడుతున్నాయి. ఆస్తుల కాజేతకే ఈ చట్ట సవరణ చేశారని పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హక్కులను హరించేలా ఈ బిల్లు ఉందని అంటున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 25వేల ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయి. రోజురోజుకూ ఆ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉండగా ఇటీవల వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదింపజేసుకుంది. దీనికి రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి, జనసేన మద్దతునిచ్చాయి. జిల్లాలోని ముస్లింల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇంతకు ముందు ఉన్న వక్ఫ్ చట్టం, వక్ఫ్ ఆస్తుల సక్రమ పరిపాలన, ఆక్రమణల నుండి రక్షణతో పాటు ముస్లిం సమాజ ప్రయోజనాలకోసం నిధులను వినియోగించ డాన్ని నిర్ధారించింది. కొత్త వక్ఫ్ సవరణ చట్టం అనేక అసంబద్ధ విధానాలను కలిగి ఉంది. బిజెపి ప్రభుత్వం మంద బలంతో ఈ చట్టాన్ని పార్లమెంట్ ద్వారా ముందుకు తీసుకెళ్తోంది. తద్వారా రాజ్యాంగంలో హామీ ఇచ్చిన అల్పసంఖ్యాక హక్కులను అడ్డుకుంటూ, హిందుత్వ ఏజండాను మరింత ప్రోత్సహించడ మే లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలోని ముస్లింల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలు సంఘాలు ఆందోళన బాట పట్టాయి. ఈ వక్ఫ్ చట్ట సవరణపై పలు పార్టీలు, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ వ్యతిరేకమని, సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా మైనార్టీలో ఉన్న బిజెపి ఇతర పార్టీల మద్దతుతో పార్లమెంటులో, రాజ్యసభలో ఈ బిల్లును పాస్ చేసుకోవడం ముస్లిం హక్కులలో తలదూర్చడమేనని వామపక్షాలు మండిపడుతున్నాయి. భూముల పరిరక్షణ కమిటీలో ముస్లిమేతరులను సభ్యులుగా చేర్చడం అంటే ఈ భూములను భవిష్యత్తులో ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు పెద్ద ఎత్తున కుట్ర దాగి ఉందని, ఈ చట్టం రాష్ట్రాల పరిధిలో ఉంది. రాష్ట్రాల పరిధి నుండి కేంద్రం తమ గుప్పెట్లకు తీసుకొని రాష్ట్రాల హక్కులను హరిస్తుందని అంటున్నాయి. ముస్లింలకు అండగా ఉంటామని చెబుతున్న టిడిపి, జనసేన, లోలోపల కుమ్మక్కైన వైసిపి కూడా ముస్లింలకు ద్రోహం చేశాయని చెబుతున్నాయి. ఈ వక్ఫ్ చట్ట సవరణపై జిల్లా వ్యాప్తంగా ముస్లింలు, వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలు, ధర్నాలు, మానవహారాలు నిర్వహించారు. వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాలు విడుదల : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో కర్నూలు జిల్లా 8వ స్థానంలో నిలిచింది. ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో మాత్రం 11వ స్థానంలో నిలిచింది. కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా గురుకుల విద్యాలయాలకు చెందిన విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. ఇంటర్మీడియట్ బోర్డు శనివారం ఇంటర్ పరీక్షాఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 20,427 మంది విద్యార్థులు పరక్షలు రాయగా ఇందులో 14860మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 73శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఇంటర్‌ద్వితీయసంవత్సరంలో 18093 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14967 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 83శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.

యుటిఎఫ్ భవన్ ప్రారంభం : కర్నూలు జిల్లాలో ఉపాధ్యాయ ఉద్యమానికి దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) జిల్లా కార్యాలయం ప్రారంభమైంది. కర్నూలు నగరంలోని సోమిశెట్టి నగర్‌లో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి వేలాది ఉపాధ్యాయులు తరలివచ్చారు. అంతకుముందు సిక్యాంపు సెంటర్ నుండి యుటిఎఫ్ కార్యాలయం వరకు ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ నినాదాలతో ప్రదర్శన నిర్వహించారు.యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి ఆధ్వర్యంలో జరిగిన ప్రారంభోత్సవంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ అధ్యక్షతన 'విద్యా రంగ సవాళ్లు- కర్తవ్యాలు' అంశంపై ప్రాంతీయ విద్యా చైతన్య సదస్సు నిర్వహించారు.



సాగని ఈకెవైసి : రేషన్‌కార్డులో ఉన్న సభ్యులందరికీ ఈకెవైసి పూర్తి చేసే ప్రక్రియ మందగమనంగా సాగుతోంది. కుటుంబ యజమానితో పాటు కార్డులో సభ్యులుగా ఉన్న వారందరికి తప్పని సరిగా చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించడంతో గత నెల రోజులుగా ఈ ప్రక్రియను జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులు చేపట్టారు. కర్నూలు జిల్లాలో 6,76,209 లక్షల రేషన్‌కార్డులు ఉండగా వాటిలో మొత్తం 21,92,047 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారిలో 19,56,826 మంది ఈ-కెవైసికి చేసుకున్నారు. ఇంకా 1,82,991 మంది ఈ కెవైసి పెండింగ్‌లో ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5,41,804 రేషన్‌కార్డులు ఉండగా వాటిలో15,77,936 మంది లబ్ధిదారులు ఉన్నారు. వాటిలో 14,35,229 మంది ఈ కెవైసి చేయించుకున్నారు. ఇంకా 1,05,153 మంది ఈ కెవైసి పెండింగ్‌లో ఉంది.



మంత్రికి డిఎంహెచ్ఒ స్వాగతం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో స్టేట్ క్యాన్సర్ ఆసుపత్రి పలు విభాగాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు డిఎహెచ్ఒం సాదర స్వాగతం పలికారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ పి.శాంతికళమంత్రి పుష్పగుచ్చం అందజేశారు.

పుల్లయ్య కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్



జి. పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాల నైతిక విలువలు, క్రమ శిక్షణ, సాంప్రదాయ పద్ధతులను కొనసాగించాలంటే స్వాగతం, వీడ్కోల కార్యక్రమం ఎంతో అవసరమని తెలిపారు. స్వాగత కార్యక్రమంలో కొత్తగా వచ్చిన విద్యార్థులు వారి సీనియర్స్‌ను చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని తెలిపారు. వివిధ విభాగాధిపతులు ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో 'కర్నూలు శ్రీ చైతన్య' ఘన విజయం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జెఇఇ మెయిన్స్ ఫలితాలలో తమ విద్యార్థులు అనితర సాధ్యమైన ప్రతిభను ప్రదర్శించారని శ్రీ చైతన్య కళాశాల ఎజిఎం మురళీకృష్ణ, డీన్స్ సరళ, బాలాజీ ,కల్యాన్ బాబు తెలిపారు. ఆలిండియా స్థాయిలో వివిధ కేటగిరీలలో తమ విద్యార్థులు బి.వంశీ కృష్ణ 137వ ర్యాంకు, జి.తేజ 177వ ర్యాంకు, జి.గిరీశ్ కుమార్ 1072వ ర్యాంకు, కె.వినయ్ కుమార్ 1306వ ర్యాంకు, టి.సాయి ప్రనజ 1496వ ర్యాంకు, ఆర్.ఉపేంద్ర రెడ్డి 2236వ ర్యాంకు, పి.వెంకట విశాల్ 4310వ ర్యాంకు, కె.మోక్షిత్సాయి 5900వ ర్యాంకు, పి. అభిషేక్ నాయక్ 6705వ ర్యాంకు, సి. నొవినేశ్ నాథ్ 6726వ ర్యాంకు వంటి ఎన్నో ఉత్తమ ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో తమ విద్యార్థులు 198 మంది జెఇఇ అడ్వాన్సుకు అర్హత సాధించారని, గత ఏడాదికి, ఈ ఏడాదికి ఫలితాలు మెరుగుపడినట్లు ఎజిఎం మురళీకష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీచైతన్య సరైన ఎంపిక అని నిరూపితమవుతున్నట్లు తెలిపారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక సిబ్బందిని , సహాయ సహకారాలు అందించిన తల్లిదండ్రులను అభినందించారు.

ఈ-వ్యర్థాల పునరుత్పత్తితో మానవ మనుగడ

మంత్రి టిజి. భరత్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో ఎలక్ట్రిక్ వస్తువులు అనివార్యమైనప్పటికీ, వాటి వ్యర్థాలు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టిజి. భరత్ అన్నారు. ఈ-వ్యర్థాలను పునరుత్పత్తి చేయడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. 'స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరపాలక సంస్థలో జరిగిన 'ఈ-చెక్' (ఎలక్ట్రిక్ వ్యర్థాల పునర్వినియోగం) అవగాహన కార్యక్రమంలో మంత్రి భరత్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి ఉమ్మడి జిల్లాలో ఈ-వేస్టేజ్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ వ్యర్థాలను ప్రజలు రెడ్యూస్, రియూజ్, రీసైక్లింగ్ కేంద్రాలకు అందించాలని కోరారు. విజన్-2047 ప్రణాళిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ-వ్యర్థాల వల్ల కలిగే ముప్పును నివారించడానికి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని, నాయకులు ప్రజల్లో చైతన్యం కలిగించాలని మంత్రి పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ బి. నవ్య మాట్లాడుతూ, స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం ఒక ప్రత్యేక నినాదంతో పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ-వ్యర్థాలు, ప్లాస్టిక్ వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోందని అన్నారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, గ్రామ పంచాయతీలో ఆర్ఆర్ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు తమ వద్ద ఉన్న పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను ఈ కేంద్రాలకు అందించాలని, ఇందుకోసం మొబైల్ సేకరణ వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించడం ద్వారా కంపోస్ట్ ఎరువులు తయారు చేసుకోవచ్చని ఆమె సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛ ఆంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యర్థాలను నగర పాలక సంస్థకు అందిస్తేనే పర్యావరణాన్ని కాపాడు కోగలమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ ఇఇ పివి. కిశోర్ రెడ్డి, ఇతర అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి టిజిభతర్, జెసి నవ్య, రవీంద్రబాబు

జెఇఇ కర్నూలు నారాయణలో అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్



జెఇఇ మెయిన్ సెషన్-2 ఫలితాలను పరీక్ష నిర్వహణ సంస్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) శుక్రవారం రాత్రి విడుదల చేసింది. పరీక్ష ఫలితాలలో మరోసారి కర్నూలు నారాయణ విద్యార్థిని విద్యార్థులు అదరహో అనిపించేలా ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన అభినందన సభలో కర్నూలు నారాయణ కళాశాలల కోర్ డీన్ విద్యార్థులను ప్రశంసించారు. అనంతరం డిజిఎం టి. గోవర్ధన్ రెడ్డి, డీన్లు ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, డి.వేణు గోపాల్ రెడ్డి లు ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలు తెలియజేస్తూ విద్యార్థులను అభినందించారు. టి. మిథున్‌సాయి 99.91 పర్సంటైల్తో 1464 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరి నందు 253వ ర్యాంకు సాధించారు. టాపర్ గా కె. జీవన్ కుమార్ 99.85 పర్సంటైల్తో 2430 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరి నందు 447వ ర్యాంకు, కె.చరణ్ కుమార్ 99.84 పర్సంటైల్తో 2605 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరిలో 488వ ర్యాంకు, ఎస్.శివ ధనుష్ 99.48 పర్సంటైల్తో 8180 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, ఖాజా ఫౌజాన్ అహ్మద్ 99.43 పర్సంటైల్తో 8930 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు ,క్యాటగిరిలో 1091వ ర్యాంకు, కె.సాయి శృతి 99.43 పర్సంటైల్తో 8933 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, ఎస్.సాయి మానస్ గౌడ్ 99.29 పర్సంటైల్తో 11030 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, క్యాటగిరిలో 2504వ ర్యాంకు, కె.సాయి భాస్కర్ 99.21 పర్సంటైల్తో 12263 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, ఎన్ హర్షిత 99.19 పర్సంటైల్ తో 12470 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, ఎమ్. శాంతా జోన్స్ 99.10 పర్సంటైల్తో 13970 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరిలో 3284వ ర్యాంకు, డి. ధరణి 99.09 పర్సంటైల్తో 14139 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు , క్యాటగిరి నందు 1845వ ర్యాంకు, ఎ. ఫణిశ్రీ సౌగంధ్ 98.81 పర్సంటైల్తో 18433 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, టి. రాహుల్ అపురూప్ 98.57 పర్సంటైల్తో 22050 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, కె. తన్మయి రెడ్డి 98.49 పర్సంటైల్తో 23168 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకు, జె. ప్రణిత్ రెడ్డి 98.38 పర్సంటైల్ తో 24916 ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకులు వచ్చాయి. ఆల్ ఇండియా ఓపెన్ ర్యాంకులో 5,000 లోపు ముగ్గురు,10,000 లోపు ఆరుగురు, 20,000 లోపు 12 మంది,30,000 లోపు 16మంది, 40,000 లోపు 23 మంది, 50,000 లోపు 26 మంది, 100000 38 మంది విద్యార్థులకు ర్యాంకులు వచ్చాయి. అంతే కాక దీనితోపాటు వివిధ క్యాటగిరీలలో టి. మిథున్ సాయి 253 ర్యాంకు, ఎమ్. రుషి తేజ 334 ర్యాంకు, కె.జీవన్ కుమార్ 447 ర్యాంకు, కె. చరణ్ కుమార్ 488 ర్యాంకు, ఎమ్.చంద్ర శేఖర్ కుమార్ యాదవ్ 784, ఆల్ఫ్రెడ్ మణిదీప్ 877 ర్యాంకులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ బి. విజయ మోహన్, పి.సుజాత, ఎన్. సారిక ,ఎ.సరిత అధ్యాపకులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఐకమత్యంతో పోరాటం

వక్ఫ్ చట్ట సవరణపై నిస్సార్ అహ్మద్ పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజలందరి ఐకమత్యంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి వక్ఫ్ నల్ల చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాడుదామని రిటైర్డ్ ప్రిన్సిపల్ నిస్సార్ అహ్మద్ పిలుపునిచ్చారు. శనివారం కర్నూలు నగరంలోని పాత బస్తిలో నూర్ అహమద్ హోటల్ ముందు సేవ్ వక్ఫ్ జెఎసి పిలుపు మేరకు కార్నర్ మీటింగులో మాట్లాడారు. నిస్సార్ అహ్మద్, సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు డి. అబ్దుల్ దేశాయ్, ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్ఎండి .షరీఫ్, ఫెడరేషన్ ఆఫ్ ముస్లిం అసోసియేషన్ నాయకులు ఎంఎ. హమీద్, జమాతే ఇస్లామి ఏ హింద్ నాయకులు పిఎస్. మునీర్ అహమద్ మాట్లాడారు. తక్షణమే వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని కోరుతూ ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు కర్నూలు నగరంలో ఈనెల 28న ఉస్మానియా కాలేజ్ గ్రౌండ్ నుండి భారీ ర్యాలీ చేయాలని కోరారు. ఈనెల 30న రాత్రి 9:00 నుండి 9:30 వరకు అర్ధగంట పాటు కరెంటు బంద్ చేసి తమ నిరసనను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలని వారు తెలిపారు. జెఎసిగా ఇతర కార్యక్రమాలు ప్రభుత్వపై ఒత్తిడి తేవడం కోసం ఇచ్చిన ప్రతి పిలుపుని ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని, తద్వారా ప్రభుత్వం పై ఒత్తిడి పెరిగి ఈ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకునే వరకు మనమంతా కలిసి శాంతియుత ఆందోళన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఇస్మాయిల్, ఇనాయతుల్లా, గౌస్‌బాషా, శేక్షావలి, బషీర్ అబ్దుల్ మసీద్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

తహశీల్దార్ వెంకటేష్ నాయక్

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

స్వర్ణాంధ్ర-2047 సంకల్పంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత పై కోడుమూరు ఎమ్మార్వో వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు. ఎమ్మార్వో ఆఫీస్ యందు పరిసరాలను స్వయంగా శుభ్రపరిచారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వెల్లడించారు. పరిసరాలను అపరిశు భ్రంగా ఉంచుకోవడం వలన అనారోగ్య సమస్యలు తలుపుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ రామాంజనేయులు విఆర్వోలు ఎల్లప్ప, మధు, షేక్ అన్నా, రేష్మ తదితరులు పాల్గొన్నారు



రచ్చుమర్రి శివరాం మృతి పార్టీకి తీరనిలోటు

- వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి - సంతాపం తెలిపిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మంత్రాలయం


నివాళులర్పిస్తున్న ప్రదీప్ రెడ్డి

రచ్చుమర్రి శివరాం మృతి పార్టీకి తీరని లోటని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. జీవనోపాధి కోసం సోదరులతో మంత్రాలయంలో స్థిరపడిన శివరాం అనారోగ్యంతో బాధ పడతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. శివరాం మృతదేహాన్ని ఆయన స్వగ్రామమైన రచ్చుమర్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ప్రదీప్ రెడ్డి రచ్చుమర్రి గ్రామానికి చేరుకుని శివరాం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి శివరాం సోదరులు బంగారు బాబుకు ఫోన్ చేసి పరామర్శించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమా రెడ్డి, వైసిపి మండల ఉపాధ్యక్షులు తెల్లబండ్ల భీమయ్య వేర్వేరుగా శివరాం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముస్లిం హక్కుల కాల రాస్తున్న బిజెపి

తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు

- వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి - ముస్లింలు, మత పెద్దలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, మత పెద్దలు

ముస్లిం హక్కుల కాల రాస్తున్న బిజెపి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, వక్ఫ్ సవరణ బిల్లును వెనక్కు తీసుకోవాలని జామియా మసీద్ మత పెద్దలు ఖాసీం బేగ్, రసూల్, సయ్యద్, చాంద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో జామియా మసీద్ ఆధ్వర్యంలో జామియా మసీద్ నుంచి సోమప్ప సర్కిల్ వరకు శాంతియుత ర్యాలీ, నిరసన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో మత గురువులు వినతి పత్రం అందజేశారు. అల్లావుద్దీన్ దౌలా, యూసుఫ్ మోలా, సిఫత్ మౌలానా, అతావుల్లా మౌలానా, ఖైర్ ఉల్లా మౌలానా, అల్తాఫ్, దర్గా కమిటీ సభ్యులు ఇమ్రాన్, వహీద్, అన్వర్, ముస్లిం పెద్దలు, భారీ ఎత్తున ముస్లిం, మైనార్టీలు పాల్గొన్నారు.

ఆదోనిలో రన్ ఫర్ జీసస్

ప్రజాశక్తి - ఆదోని


ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆదోనిలోని క్రైస్తవులు 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమం నిర్వహించారు. శనివారం పట్టణంలోని విక్టోరియా పేటలోని సిఎస్ఐ చర్చి నుంచి కొత్త బస్టాండ్ రోడ్డులోని ఆర్‌సిఎం చర్చి వరకు ఏసు క్రీస్తు స్తుతి గీతలు అలపిస్తూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎసియుసిఎ అధ్యక్షులు పాస్టర్లు ఆనంద్ రాజు, ఉపాధ్యక్షులు ఫాదర్ కోలా విజయరాజు మాట్లాడారు. ప్రతిఒక్కరూ సామాజిక స్పృహ కలిగి జీవించాలని, ఉన్న సంపదలోనే సంతృప్తి పడి ఇతరులకు మేలు చేసే స్వభావం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఎసియుసిఎ కార్యదర్శి పాస్టర్ ఎజ్రా శ్రీధర్, ట్రెజరర్ హెచ్.థామస్, ఆల్బర్ట్, శాంతరాజు, ఫిలిప్ జయరాజు, ఆంథోని, సామ్యేల్, సంఘ పెద్దలు సంగటి దేవదానం, లూర్ధయ్య, నెట్టేకంటయ్య, అమలనాథన్ ఉన్నారు. **ఆలూరు** మండలం ఎం.కొట్టాల గ్రామంలో సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్‌లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ గీతలు ఆలపిస్తూ పురవీధుల గుండా ప్రదర్శన చేపట్టారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పత్తికొండ ప్రసాద్ టీషర్ట్స్, క్యాప్స్ అందించారు. పాస్టర్ సత్యానందం, భాస్కర్, సంఘ పెద్దలు దేవపుత్ర, ధర్మన్న, రాజు, ఆశీర్వాదం, దాసప్ప, ఆనంద్, ప్రసాద్, బెన్నీ, సురేష్ బాబు, ఇమ్మానుయేలు, వాసు, సచిన్ పాల్గొన్నారు.

అన్నదాతకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - ఆస్పరి


ఆర్థిక సాయం అందజేస్తున్న అధికారులు, సర్పంచి

ఆస్పరిలో రైతు మహబూబ్ బాషకు ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి మహబూబ్ బాషకు చెందిన ఎద్దు మృతి చెందింది. శనివారం గ్రామ సచివాలయంలో సర్పంచి మూలింటి రాధమ్మ, సొసైటీ జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర స్పందించి మహబూబ్ బాషకు రూ.5 వేలను ఎంపిడిఒ గీతావాణి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రకృతి విపత్తుల వల్ల ఎద్దు మరణించడం బాధాకరమని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామని పేర్కొన్నారు. విఆర్‌ఒలు రజిని, అల్లాబకాష్, పంచాయతీ కార్యదర్శి విజయరాజు, ఎపిఎం జనార్ధన్ పాల్గొన్నారు.

గాలిపెంటలో దాహం.. దాహం...

- పది రోజులుగా రాని నీరు - గ్రామానికి ఉన్నది ఒకే ఒక్క బోరు - అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని గాలిపెంట గ్రామంలో గ్రామస్తులు దాహంతో అల్లాడుతున్నారు. పది రోజులుగా నీటి సరఫరా లేదని వాపోతున్నారు. గ్రామానికి అంతా ఒకే ఒక్క బోరు ఉందని పేర్కొంటున్నారు. నీటి సమస్యను పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దప్పిక తీర్చుకోవాలంటే పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్ల దగ్గరకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

ఆస్పరి మండలం గాలిపెంటలో గ్రామంలో 10 రోజుల నుంచి తాగు నీరు రాక దాహంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు మాణిక్యమ్మ, అంజలి, రంగమ్మ, రామలింగ, లక్ష్మన్న, నరసన్న, భీమన్న వాపోయారు. ఆ గ్రామంలో 100 కుటుంబాలు, 450 మంది జనాభా ఉన్నారు. ఉన్న ఒక్క బోరుకు కూడా నీరు రావడం లేదని, పది రోజుల నుంచి పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దప్పిక తీర్చుకోవాలంటే పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ బోర్ల దగ్గరకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. సమస్యను పంచాయతీ కార్యదర్శి జాకీర్ హుస్సేన్ దృష్టికి తీసుకెళితే తన చేతిలో ఏమీ లేదని, సర్పంచితో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని చెబుతున్నారు. సర్పంచి, కార్యదర్శి ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ పది రోజుల నుంచి సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.


నీటి కోసం వేచి ఉన్న గ్రామస్తులు

పది రోజులుగా నీరు రావడం లేదు

- బోయ కాశమ్మ, గాలిపెంట



మా గ్రామంలో పది రోజులుగా నీరు రాక చాలా ఇబ్బంది పడుతున్నాం. సర్పంచి, పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. నీటి సమస్యను పరిష్కరించి మమ్మల్ని ఆదుకోవాలి.

తాగు నీటి సమస్యను పరిష్కరిస్తాం

- ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హనుమంతప్ప

గాలిపెంట గ్రామస్తులు నీటి సమస్యను మా దృష్టికి తీసుకొచ్చారు. బోరులోకి మరిన్నీ పైపులు దింపి నాలుగు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం.

బడిలోనే పిల్లల భవిష్యత్తు

- ప్రధానోపాధ్యాయులు శాంతి రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పిల్లల బంగారు భవిష్యత్తు బడిలోనే రూపుదిద్దుకుంటుందని మాచుమాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతిరాజు పేర్కొన్నారు. శనివారం మాచుమాన్ దొడ్డి గ్రామంలో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు మోడల్ పాఠశాల 6వ తరగతి నమూనా ప్రవేశ పరీక్ష నిర్వహించి వారికి సూచనలు ఇచ్చారు. అనంతరం వారికి హాల్ టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఈ ఏడాది విద్యార్థుల నమోదుకు ఒక కొత్త కార్యక్రమం చేపట్టిందని, వేసవి సెలవులు ముగిసేలోపు 1వ తరగతి ప్రవేశాలు, 6వ తరగతి ప్రవేశాలు పూర్తి చేయాలని ఆదేశించిందని తెలిపారు. ఊరిలోనే బడి ఉండగా ఎక్కడో ఎందుకు చేర్పిస్తారని, ఐదేళ్లు నిండిన పిల్లలను మన ఊరు బడిలోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫారం, బ్యాగు, బెల్టు, రుచికరమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రయివేట్ పాఠశాలల్లో చిన్న, చిన్న షెడ్డుల్లో, ప్రతి దానికీ పరీక్షల ఫీజులు కూడా వసూలు చేస్తారన్నారు. అందరూ ఊరిలోని బడిలోనే పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ వేసవి సెలవుల్లో పిల్లలు ఇంటి దగ్గరే ఉంటూ బావులు, చెరువులు, నీటికుంటల దగ్గరకు వెళ్లకూడదని సూచించారు.


అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు

సృజనాత్మకత వెలికి తీయడమే 'గ్లోబల్'లక్ష్యం

- కరస్పాండెంట్ గంగాధర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



పట్టణ టాపర్లకు అవార్డు అందిస్తున్న యాజమాన్యం

విద్యార్థుల్లో సృజనాత్మక వెలికి తీయడమే గ్లోబల్ జీనియస్ జూనియర్ కళాశాల లక్ష్యమని కళాశాల కరస్పాండెంట్ జి.గంగాధర్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ సంధ్య, ముఖ్య అతిథి సీనియర్ నాయకులు సత్యనారాయణ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ మునిస్వామి తెలిపారు. శనివారం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన కళాశాల విద్యార్థులకు మెడల్‌తో సన్మానం చేసి, తల్లిదండ్రులను శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ కళాశాలలో ఇంటర్ విద్యతోపాటు నీట్, జేఈఈ, ఎంసెట్‌కు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

'చెత్త సంపద'ను సమర్థంగా చేపట్టాలి

- డిపిఒ భాస్కర్

ప్రజాశక్తి - నందవరం

చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని డిపిఒ జి.భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన నందవరం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 10 బెస్ట్ చెత్త నుంచి సంపద కేంద్రాలను ఎంపిక చేసినట్లు, నందవరం మండలాన్ని ఎంపిక చేసినట్లు తెలి పారు. మండలంలో ఉన్న ప్రతి కేంద్రాన్నీ సమర్థవంతంగా నిర్వహిం చాలని పంచాయతీ కార్యదర్శులకు, పారిశుధ్య కార్మికులకు సూచించా రు. షెడ్డు పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రం చుట్టూ ఫెన్సింగ్, గేటు ఏర్పాటు చేయాలని చెప్పారు. షెడ్డు లోపల మొక్కలు నాటించడం, సేకరించిన చెత్తను సెగ్రి గేషన్ చేసి ఎరువు తయారు చేసే విధంగా సిబ్బందికి సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం లో మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. పైపులైన్లు, మోటార్లను రోజూ గమనిస్తూ ఉండాలని తెలిపారు. మరమ్మతు లుంటే చేయించడం, క్లోరినేషన్, విద్యుత్ లైన్లు వేయించాలని సూచించారు. తాగునీటి సమస్యలు తలెత్తితే తమ దృష్టికి వస్తే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపిడిఒ పుల్లయ్య, ఇఒఆర్‌డి సందీప్, పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, గోవర్ధనమ్మ, శ్రీనివాసులు, పెద్దరెడ్డి, రామారావు పాల్గొన్నారు.


డిపిఒ భాస్కర్‌ను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గత ప్రభుత్వం చెత్తకు పన్ను వేస్తే..

'కూటమి'లో సంపద సృష్టి

- స్వర్ణాంధ్ర - స్వచ్ఛ దివస్ ర్యాలీలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

గత వైసిపి ప్రభుత్వం చెత్తకు పన్ను వేస్తే.. కూటమి ప్రభుత్వం చెత్త నుంచి సంపదను సృష్టించి రాష్ట్రానికి ఆదాయం తీసుకొస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే ర్యాలీ చేపట్టారు. అనంతరం మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ దివస్ వైపు ముందుకు పోతుందన్నారు. తడి, పొడి చెత్త కాకుండా ఇంట్లో ఉండే ఎలక్ట్రానిక్ చెత్తను సేకరించి మళ్లీ దానిని ఉపయోగించు కునేలా పునరుద్ధరణ చేసి కొత్త ఉత్పత్తిని తయారు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజలు కూడా రోడ్డుపై చెత్తను వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందజేసి పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ



జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'నారాయణ' విజయ దుందుభి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ప్రభుత్వం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పట్టణంలోని నారాయణ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థులు టౌన్ టాపర్లుగా నిలిచారు. ఎం.మోహన్ కృష్ణ 96.93 పర్సెంటైల్, క్యాట్ ర్యాంకు 13,587, ఎ.విజయ్ ప్రశాంత్ రాజు క్యాట్ ర్యాంకు 24,366 సాధించి టౌన్ టాపర్లుగా నిలిచారు. జేఈఈ అడ్వాన్స్‌లో కూడా అనేక మంది విద్యార్థులు అర్హత సాధించి విజయపథంలో నడిచారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి నారాయణ కళాశాల డిజిఎం గోవర్ధన్ రెడ్డి, డీన్ ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నారాయణ కళాశాల ఎజిఎం రమణా రెడ్డి, ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, తిమ్మా రెడ్డి శనివారం అభినందించారు.

వీరశైవ లింగాయత్‌ల ఐక్యతకు కృషి

- జాతీయ అధ్యక్షులు ప్రవీణ్ కంకణ వాడి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌ల ఐక్యతకు కృషి చేస్తామని వీరశైవ లింగాయత్‌ల సంఘం జాతీయ అధ్యక్షులు ప్రదీప్ కంకణ వాడి తెలిపారు. శనివారం మంత్రాలయం చేరుకున్న ఆయనకు సంఘం మండల అధ్యక్షులు మూలింటి చంద్రశేఖర్ గౌడ్, ఎల్లా లింగస్వామి స్వాగతం పలికారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న వారు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. పక్కనే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో వీర శైవులు రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదిగి, ఉన్నత పదవులు అనుభవిస్తున్నారని తెలిపారు. ఆంధ్రా రాష్ట్రంలో రాజకీయంగా ఎదగడం లేదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో వీరశైవ లింగాయత్‌ల ఐక్యతకు, బలోపేతానికి కృషి చేసి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో ఐక్య వేదికను తయారు చేసి రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేస్తామని తెలిపారు. వీరశైవ లింగాయత్ సంఘటిత వేదిక మండల గౌరవాధ్యక్షులు ఆడిటర్ శంకర్ స్వామి, ఉపాధ్యక్షులు రుద్రయ్య స్వామి, పరమేష్ గౌడ్, పాండు గౌడ్, రమేష్, చెట్నిహళ్లి రవి గౌడ్, మల్లి గౌడ్ ఆయనను ఘనంగా సన్మానించారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న ప్రవీణ్

ఎలక్ట్రికల్ పాత సామాన్లు సేకరించాలి

- మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ

ప్రజాశక్తి - ఆదోని

ఎలక్ట్రికల్ పాత సామాన్లను స్వచ్ఛందంగా ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆదోని భీమాస్ కూడలిలో శనివారం ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ-వ్యర్థాల నుంచి వచ్చిన ఈ వేస్ట్‌ను మళ్లీ రీసైక్లింగ్ చేస్తారని, కొన్ని కెమికల్ ఇన్‌ఫ్లెటెడ్ అయ్యే వేస్ట్ ద్వారా కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరిస్తూ నిల్వ ఉన్న సామాన్లను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణంలోని శ్రీనివాస్ భవన్ నుంచి భీమాస్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ప్రతిజ్ఞ చేయించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, నాగరాజు, మెప్మా సిఎంఎం జిలాన్, మెప్మా సిఒలు జావిద్, నారాయణమ్మ, వెంకట లక్ష్మి, అంజన, శానిటేషన్ ఉద్యోగులు రాజేశ్వరి, వెంకప్ప, నరసింహులు, తిక్క స్వామి ఉన్నారు. **చిప్పగిరిలో** ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చిప్పగిరి పంచాయతీ కార్యదర్శి ప్రమీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, పరిపాలనాధికారి శ్రీనివాసులు మాట్లాడారు. ఎంఇఒ సావిత్రమ్మ, ఆర్ఐ సునీత, ఏపీవో జుబేర్ అహ్మద్, విఆర్‌ఒలు గోవిందప్ప, మల్లికార్జున, ఎఎన్ఎం శాంత కుమారి పాల్గొన్నారు. **కోసిగి** ఆర్‌టిసి బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు గుండా తేరుబజార్ వరకు సర్పంచి అయ్యమ్మ, టిడిపి మండల అధ్యక్షులు జ్ఞానేష్ అధ్యక్షతన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. టిడిపి మంత్రాలయం ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బస్టాండ్‌లో ఉన్న మొబైల్ షాపుల నుంచి ఈ-వేస్ట్‌ను సేకరించి అక్కడి నుంచి తేరు బజారులో ఉన్న చెత్తాచెదారాన్ని అధికారులు, మండల నాయకులతో కలిసి పరిశుభ్రం చేశారు. ప్రతి గ్రామాన్నీ పరిశుభ్రంగా ఉంచేందుకు రోజూ కొన్ని నిమిషాలు పరిశుభ్రత కోసం సమయాన్ని వెచ్చించాలని ప్రతిజ్ఞ చేశారు. ముత్తురెడ్డి, వక్రాని వెంకటేష్, హొళగుంద కోసిగయ్య, తోవి రామకృష్ణ, నాడిగేని అయ్యన్న, మాణిక్య రాజు, కోల్మన్ పేట అర్జున్, బిజెపి మండల అధ్యక్షులు రాముడు పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని పోలీసు స్టేషన్ ఆవరణలో సిఐ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర నిర్వహించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో చెత్తాచెదారం తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. మొక్కలు, చెట్లకు పాదులను ఏర్పాటు చేశారు. వాటి నీటి వసతి కోసం మోటారుకు మరమ్మతులు చేయించారు. గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో ఈ-వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ మణి మంజరి పాల్గొన్నారు. ఎలక్ట్రానిక్ ఈ-వ్యర్థాలంటే ఏమిటి, వాటి వల్ల కలిగే నష్టాలు, వాటిని ఏ విధంగా నిర్వహించాలి అనే అంశాలపై ప్రజలకు వివరించారు. **ఆలూరు**లో తహశీల్దార్ గోవింద్ సింగ్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర చేపట్టారు. ముఖ్య అతిథిగా ఆర్‌డిఒ భరత్ నాయక్ హాజరయ్యారు. పట్టణంలో ప్రధాన వీధుల గుండా టిడిపి మండల కన్వీనర్ అశోక్ యాదవ్, అంజినయ్య, సుమన్, ఆర్ఐ బసవన్న గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ ర్యాలీ నిర్వహించారు. **కౌతాళం**లో ఇఒఆర్‌డి యోగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.



ఆదోనిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ అనుపమ


కోసిగిలో చీపురు పట్టి ఊడుస్తున్న టిడిపి నాయకులు


గోనెగండ్లలో ఈ-వ్యర్థాల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ


తడిసిన వరిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలం మేలిగనూరు, నదీచాగి, కుంభాలనూరు గ్రామాల్లో అకాల వర్షం వల్ల తడిసిన వరి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం గాలివాన బీభత్సానికి దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులను, పంట పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈఏడాది పత్తి, మిరప వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని, వరి పంట చేతికొచ్చిన సమయంలో అకాల వర్షాల వల్ల రైతులు పూర్తిగా నష్టపోయారని తెలిపారు. వరి ధాన్యాన్ని కొనడానికి ప్రస్తుతం వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదని, తడిసిన ధాన్యమైతే ధర పూర్తిగా దెబ్బతింటుందని చెప్పారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు ఈ రెండు గ్రామాల్లో బీభత్సం సృష్టించాయని, ఇళ్ల ముందు వేసుకున్న రేకుల షెడ్లు పూర్తిగా ఎగిరిపోయాయని తెలిపారు. కొన్ని పాత ఇళ్లు దెబ్బతిన్నాయని, తడిసి ముద్దయిన వరి రైతులను ఆదుకుంటూ, ఇళ్ల ముందు రేకుల షెడ్లు ఎగిరిపోయిన కుటుంబాలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతుసంఘం నాయకులు హనుమంతు, ఈరన్న, ముక్కన్న, వలీ, వెంకటేష్, ఈరప్ప పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న నాయకులు


అధికారులను నిలదీస్తున్న జడ్‌పిటిసి లింగప్ప

తప్పుల తడకగా రీసర్వే

- జడ్‌పిటిసి లింగప్ప మండిపాటు

- నీటి సమస్యపై అధికారులపై ఎంపిటిసిల ఆగ్రహం

ప్రజాశక్తి - హాలహర్వి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే తప్పుల తడకగా మారిందని, తప్పుల్లేకుండా రీ సర్వే పూర్తి చేపట్టాలని జడ్‌పిటిసి లింగప్ప అధికారులకు తెలిపారు. శనివారం హాలహర్వి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జడ్‌పిటిసి లింగప్ప, ఎంపిటిసిలు అధికారుల పనితీరుపై మండిపడ్డారు. అనంతరం ఎంపిటిసిలు మాట్లాడుతూ... తమ గ్రామాల్లో నీటిని శుద్ధి చేయకుండా వదులుతున్నారని, శుద్ధి చేసి వదలాలని డిమాండ్ చేశారు. హాలహర్వి సర్పంచి మల్లికార్జున మాట్లాడుతూ... తమ గ్రామంలో పెద్దవంక ఊరి పక్కనే ప్రవహిస్తోందని, పెద్ద వర్షం వస్తే ఊళ్లోకి నీళ్లు వస్తాయని తెలిపారు. వంక ఇరువైపులా ఉన్న ముళ్లకంపను తొలగించి గ్రామాన్ని కాపాడాలని కోరారు. అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ... చిన్న, చిన్న ప్రమాదాలకు పిలవకుండా పెద్ద ప్రమాదాలు జరిగితే పిలవాలని కోరారు.

బలవర్థక ఆహారంతో రక్తహీనతకు చెక్

- తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, సూపర్‌వైజర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

ఇంట్లో ఉన్న ఆహార దినుసులతో బలవర్థకమైన ఆహారమును తయారు చేసుకొని రోజూ తినడం వల్ల రక్తహీనతను జయించవచ్చని తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన తెలిపారు. శనివారం చిప్పగిరి అంగన్వాడీ-2లో సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత నివారించడానికి బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడారు. ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పోషకాహార దినుసులను అందిస్తోందని, ఆకుకూరలు, పాలు, గుడ్డును తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఇంట్లో నిత్యం మనం తినే ఆహార దినుసుల్లో కూడా మార్పులు, చేర్పులు చేసుకుంటే రక్తహీనతను నివారించవచ్చని చెప్పారు. మాంసాహారం కన్నా ఆకుకూరల్లో మంచి విటమిన్లు దొరుకుతాయని తెలిపారు. అనంతరం పోషణ్ పక్వాడ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఎంఇఒ సావిత్రమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రమీల, ఎఎన్ఎం శాంతకుమారి పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని ఫరీదా సాహెబ్ స్ట్రీట్ అంగన్వాడీ-1 కేంద్రంలో పోషణ్ పక్వాడపై అవగాహన కల్పించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మహాదేవి మాట్లాడుతూ... రక్తహీనతను పారదోలాలంటే ఆహారంలో పోషక పదార్థాలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. వార్డులో గల మహిళలు, గర్భిణులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పోషకాహారాల విషయంలో అవగాహన అవసరమని చెప్పారు. గర్భం దాల్చిన రోజు నుంచి పుట్టిన పిల్లలు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు సంపూర్ణ పోషకాహారం అందిస్తే పిల్లల శరీర ఎదుగుదల బాగుంటుందన్నారు. మహిళా పోలీసు సుజాత, అంగన్వాడీలు పి.జానకి, లక్ష్మీదేవి, హెల్పర్స్ రెహమాత్, అన్వేషి పాల్గొన్నారు.



చిప్పగిరిలో పాల్గొన్న అధికారులు, అంగన్వాడీ సిబ్బంది


ఆదోనిలో అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ అధికారులు

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి మండలానికి వివిధ పనుల రీత్యా వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సర్పంచి మల్లికార్జున తెలిపారు. శనివారం సర్పంచి మల్లికార్జున ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చలివేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా సేవా దృక్పథంతో కొనసాగించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ఎండలకు అనుగుణంగా ప్రజల దాహార్తిని తీర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పంచాయతీ సెక్రటరీ ఈరన్న పాల్గొన్నారు.

రాజవర్ధన్‌రెడ్డి 3వ వర్ధంతి ప్రత్యేక అనుబంధం

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం



రాజకీయంలో రారాజు

- పేదల పాలిట పెన్నిధి రాజ వర్ధన్ రెడ్డి
- యువతకు ఆదర్శం ఆయన వ్యక్తిత్వం - నేడు మూడో వర్ధంతి



నాయకుడంటే సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తపనపడి, ప్రజల శ్రేయస్సు ధ్యేయంగా జీవితాన్ని త్యాగం చేసేవాడు. సరిగ్గా అదే కోవకి చెందిన వ్యక్తి కోడుమూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు డి విష్ణువర్ధన్ రెడ్డి తనయుడు కర్నూలు మాజీ ఎంపిపి డి రాజ వర్దన్ రెడ్డి. రాజవర్ధన్ రెడ్డి విభిన్నమైన పరిసరాల్లో తన జీవితాన్ని గడిపినప్పటికీ వైవిధ్య భరితమైన చరిత్ర అతనిది. రాజకీయ జీవితంలో శత్రువుల నుంచి కుటుంబాన్ని కాపాడుకోవడంలో కక్షలు,కార్పణ్యాల మధ్య నిత్యం యుద్ధ వాతావరణంలో పెరిగినప్పటికీ అందుకు భిన్నంగా తన జీవితాన్ని గడిపిన వ్యక్తిత్వం అతనిది. సమాజంలో చోటు చేసుకుంటున్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించే గొప్ప అధ్యయనశీలి. రాజకీయరంగంలో అతిపిన్న వయసులోనే తలపండిన మేధావులతో సైతం బరిలో నిలిచి తర్కంలో శాస్త్రీయ వాదాన్ని వినిపించారాయన. స్వార్థ కోసం సాగే నేటి రాజకీయాలకు భిన్నంగా సమాజ శ్రేయస్సు ధ్యేయంగా పనిచేశారాయన. తండ్రి రాజకీయ వారసత్వాన్ని ఓవైపు పుచ్చుకుంటూనే మరోవైపు తనదైన శైలిలో ప్రజల గుండెల్లో రాజకీయ ముద్రను వేసుకున్నారు. కర్నూలు ఎంపిపిగా విజయం సాధించి ప్రజల మన్ననల వర్షంలో పులకించారు. పేదలకు అవసరమైన ప్రతి అంశాన్ని పరిశీలించి వాటిని సఫలీకృతం చేసేందుకు అహర్నిశలు కృషి చేశారు. నిరాడంబరత, నిబద్ధత, ఎదుటివారిపట్ల వార్త 3లో

అన్నలాంటి వ్యక్తి రాజన్న

- ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



మాజీ ఎంపిపి డి.రాజవర్ధన్ రెడ్డి నాకు అన్నలాంటి వ్యక్తి. ప్రతి విషయంలో నాకు నా కుటుంబానికి అండగా ఉంటూ మార్గదర్శిగా నిలిచారు. ఏ చిన్న సమస్య ఎదురైనా పిలిచి భరోసానిస్తూ నీకు నేనున్నానంటూ ధైర్యం నింపేవారు. సమాజంలో ప్రతి సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారాన్ని అవలీలగా ఒడిసిపట్టేవాడు. మంచి తనానికి మారుపేరు ఆయన. రాజకీయ నాయకుడిగా సంపూర్ణ వ్యక్తి. మానవత్వంలో అతనికి సాటి లేరు. సొంత డబ్బుతో పేదలకు సహాయం చేసే గొప్ప మనసు ఆయనది. అలాంటి వ్యక్తిని హఠాత్తుగా ప్రమాదం రూపంలో విధి కబలించింది. ఆయన లేని లోటు పూడ్చలేనిది. నేటికీ ఆయన స్ఫూర్తితోనే నేను ముందుకు సాగుతున్నాను. ఆయన కుటుంబంతో పయనిస్తున్నాను. అలాంటి వ్యక్తి దూరం కావడం బాధగా ఉంది. ఆయన బతికుంటే కచ్చితంగా ఎమ్మెల్యేగా చూసేవాళ్లం.. ఆయన కుటుంబం ఆయన కుమారునిలా నన్ను ఆదరిస్తూ వస్తోంది. ఆ కుటుంబానికి నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఆయన బాటలోనే పయనిస్తాను.

ప్రజాశక్తి - కర్నూలు క్రైం



కనుమరుగవుతున్న గోలీసోడా

- మూడు షాపులకే పరిమితం
- ఎండాకాలంలోనే గిరాకీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం పొందిన గోలి సోడా ఇప్పుడు కేవలం మూడు ప్రాంతాల్లో మాత్రమే లభిస్తోంది. 50 సంవత్సరాల క్రితం వీధుల్లో విరివిగా కనిపించిన ఈ పానీయం కనుమరుగవుతోంది. ఈనేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

ఒకప్పుడు సినిమా థియేటర్ల వద్ద గోలి సోడాకు మంచి గిరాకీ ఉండేది. పాత సినిమాల్లో "సోడా సోడా ఆంధ్ర సోడా... సోడా తాగురా తెలుగోడా చల్లని సోడా" వంటి పాటలు ఆ రోజుల్లో ఎంతగానో ప్రాచుర్యం పొందాయి. డబ్బుకు విలువ ఉన్న రోజుల్లో గోలి సోడా ధర కేవలం 25 పైసలు ఉండేది. రూపాయికి సినిమా చూసే రోజుల్లో, విరామ సమయంలో బయటకు వచ్చి చల్లని గోలి సోడా, లెమన్ తాగడం ఒక ప్రత్యేక అనుభూతినిచ్చేది. ఆ సమయంలో చెక్క ఓపెనర్‌కు సైకిల్ ట్యూబ్ తొడిగి సోడా సీసా మూతపై పెట్టి ఒత్తితే వచ్చే "కుయ్యి" అనే శబ్దం ఎంతో ప్రత్యేకంగా ఉండేది.



కర్నూలు నగరంలో గోలి సోడా అమ్ముతున్న దుకాణం

పల్లెల్లో సైతం కొత్త కుండల్లో నీళ్ల పోసి చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. పొలాల నుంచి తిరిగి వచ్చే రైతులు ఆ చల్లని నీళ్ల తాగి సేదతీరేవారు. అప్పట్లో పల్లెల్లో కూడా గోలి సోడాను తయారు చేసి తోపుడు బండ్లపై వీధుల్లో అమ్మేవారు. డబ్బులు లేనివారు ధాన్యం ఇచ్చి కూడా గోలి సోడా తాగేవారు. పుల్ల ఐస్‌క్రీమ్ కూడా పల్లెల్లో ఎక్కువగా లభించేది.

కర్నూల్ నగరంలో పఠాన్ సోడా, ఈశ్వర్ సోడా ఒకప్పుడు చాలా ప్రసిద్ధి చెందాయి. కాలక్రమేణా వచ్చిన మార్పుల వల్ల, మిషన్లతో సోడా , లెమన్ కలిపి ఇచ్చే పద్ధతి రావడంతో గోలి సోడా ప్రాభవం తగ్గింది. ప్రస్తుతం వేసవిలో మాత్రమే వీటికి కొంత గిరాకీ ఉంటుంది.

ప్రస్తుతం కర్నూలు నగరంలో ఉస్మానియా కళాశాల వద్ద గణేష్ కూల్ డ్రింక్స్, శ్రీరామ టాకీస్ దగ్గర ఆంధ్ర కూల్డ్రింక్స్, సుందరయ్య సర్కిల్ వద్ద శివగంగా కూల్ డ్రింక్స్ అనే మూడు గోలి సోడా కేంద్రాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వేసవిలో తాత్కాలికంగా అనేక కూల్ డ్రింక్స్ కేంద్రాలు వెలుస్తున్నప్పటికీ, గోలి సోడా అమ్మేవారు మాత్రం కొద్దిమంది మాత్రమే ఉన్నారు.

గోలి సోడాయే నా జీవనాధారం



మల్లికార్జున గత 20 సంవత్సరాలుగా గోలి సోడా అమ్ముకుంటూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాను. వేసవికాలంలో రోజుకు సుమారు రూ.2000 వ్యాపారం జరుగుతుంది. ఖర్చులు పోను రూ.1000 వరకు మిగులుతాయి. వర్షాకాలంలో వ్యాపారం తక్కువగా ఉంటుందని, రోజుకు రూ.500 ఆదాయం వస్తుంది. నాకు ఒక కుమార్తె ఉంది. ఆమె ఏడవ తరగతి చదువుతోంది. భార్యాభర్తలమిద్దరం కలిసి ఈ పని చేసుకుంటున్నాం. బంకు ఏర్పాటు చేసుకున్న స్థలానికి సంవత్సరానికి మున్సిపల్ కార్యాలయానికి రూ.400 పన్ను చెల్లిస్తున్నాం. ప్రస్తుతం లెమన్ సోడా రూ.10, నన్నారి రూ.20, నిమ్మకాయ సోడా రూ.15 చొప్పున అమ్ముతున్నాం. నన్నారి చెక్క కేజీ రూ.1400, షాక్రీన్ కేజీ రూ.300, వంద నిమ్మకాయలు రూ.500 వరకు లభిస్తున్నాయి. గ్యాస్ సిలిండర్ ధర రూ.500 ఉంది. తమలాంటి రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వారికి ప్రభుత్వం రుణాలు ఇచ్చి ఆదుకోవాలి. అధునాతన య ం ం (తా ల ం కొనుక్కోవడానికి ఆర్థిక సహాయం అందిస్తే, ప్రస్తుత కాలానికి అనుగుణంగా వ్యాపారం చేసుకోవడానికి వీలుంటుంది. ఎండలు ఎక్కువగా ఉంటే వ్యాపారం బాగా జరుగుతుంది. ప్రస్తుతం నెలకు రూ.9000 అద్దె చెల్లిస్తూ ఒక అద్దె ఇంట్లో ఉంటున్నాం. సొంత ఇల్లు లేదు. అయినప్పటికీ, తమ కుటుంబం సాఫీగా గడిచిపోతోంది. ఉన్నదానితో సంతృప్తి చెందుతున్నాం.

- మల్లికార్జున, గోలి సోడా అంగడి యజమాని

కర్నూలు క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అధునాతన వైద్య సేవలు

- రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో అత్యాధునిక వసతులు అందుబాటులోకి తెచ్చామని రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రూ.28 కోట్లవిలువైన లీనియర్ యాక్సిలరేటర్, రూ.2.5 కోట్ల విలువైన ఇతర రోగ నిర్ధారణ పరికరాలు, ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, మెడికల్ ఆంకాలజీ వార్డులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్‌తో కలిసి సత్యప్రసాద్ ప్రారంభించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో లేని అత్యాధునిక క్యాన్సర్ చికిత్సను కర్నూలులో అందు బాటులోకి తెచ్చామని చెప్పారు. క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లోని వార్డులను పరిశీలించి, రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులు వైద్యుల సేవలతో సంతృప్తి వ్యక్తం చేయడంతో మంత్రి హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌పై శ్రద్ధ చూపలేదని, కేంద్రం నిధులు విడుదల చేసినా పనులు ప్రారంభించలేదని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌పై ప్రత్యేక దష్టి సారించి, మూడు నెలల్లో రూ.45 కోట్ల విలువైన అధునాతన పరికరాలు, మౌలిక సదుపాయాలు సమకూర్చామని తెలిపారు. మార్చి 4నాటికే నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసి ట్రయల్ బేసిస్‌పై అనేక రకాల సర్జరీలు చేసి ఉచితంగా వైద్య సేవలు అందించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వైద్య రంగంలో సిబ్బంది కొరతను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే 40 శాతం ఉన్న వైద్యుల కొరతను 6-7 శాతానికి తగ్గించామని చెప్పారు. కర్నూలు క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుండి కూడా రోగులు చికిత్స పొందుతున్నారని మంత్రి తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.20-25 లక్షల వరకు ఖర్చయ్యే వైద్య సేవలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మీడియాపై ఉందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, గౌరుచరిత, పార్థసారథి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మంత్రికి క్యాన్సర్ దశలను వివరిస్తున్న వైద్యులు

ఆరోగ్యకరమైన జీవితం అందించడమే లక్ష్యం

- డాక్టర్ మోహన్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్, కర్నూలు కన్సల్టెంట్ డాక్టర్ సివి. శేషాద్రి



ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

నేటి ఆధునిక జీవనశైలిలో డయాబెటీస్ ఒక ప్రధాన ఆరోగ్య సమస్యగా పరిణామం చెందింది. ఇది కేవలం ఒక వ్యాధి మాత్రమే కాదు, జీవన విధానాన్ని సమూలంగా మార్చేస్తుంది. ఈ నేపథ్యంలో, డయాబెటీస్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి నమ్మకమైన వైద్య సేవలు అందించాలనే దృడసంకల్పంతో డాక్టర్ వి.మోహన్ 1991లో డాక్టర్ మోహన్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్‌ను స్థాపించారు. ఈ సంస్థ భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన డయాబెటీస్ చికిత్సా కేంద్రాలలో ఒకటిగా నిలిచింది. దేశవ్యాప్తంగా 50కి పైగా శాఖలతో, లక్షలాది మంది రోగులకు అత్యాధునిక వైద్య సేవలను అందిస్తోంది. కర్నూలులో 2020లో ప్రారంభించిన ఈ ప్రత్యేక కేంద్రం, ఇప్పటివరకు 1700 నుండి 2000 మంది రోగులకు వైద్య సహాయం అందించింది. ఆధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యబృందం, సమగ్ర సేవల కలయిక ఈ కేంద్రాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి.

ఈ కేంద్రంలో కన్సల్టెంట్‌గా సేవలందిస్తున్న డాక్టర్ సివి. శేషాద్రి మాట్లాడుతూ 'ప్రతి రోగి జీవితం మాకు అత్యంత విలువైనది. వారి ఆరోగ్యాన్ని పరిరక్షించడమే మా ప్రధాన బాధ్యత. డయాబెటీస్ నియంత్రణలో మందులతో పాటు, జీవనశైలి మార్పులు, సరైన పోషకాహారం , క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణ ఎంతో ముఖ్యమైనవి మా వైద్య సంస్థ ఈ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది" అని తెలిపారు.

సమగ్ర డయాబెటిక్ పరీక్షలు

క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర స్థాయిల పర్యవేక్షణ కిడ్నీ, కంటి , పాదాల ప్రత్యేక పరీక్షలు, వ్యక్తిగత పోషకాహార సలహాలు, ఆరోగ్యకరమైన జీవనశైలి మార్పులపై నిపుణుల మార్గదర్శనం ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే రోగులకు సైతం సులభమైన , అందుబాటు ధరల్లో వైద్య సేవలు అందించడం ఈ కేంద్రం యొక్క ప్రత్యేకత. పరిశుభ్రమైన వాతావరణం, రోగుల పట్ల కరుణ , నిపుణులైన వైద్యుల సేవలు డయాబెటిస్ బాధితులకు ఒక నమ్మకమైన , ఆశాజనకమైన ప్రదేశంగా ఈ కేంద్రాన్ని నిలిపాయి.

మొత్తానికి, డాక్టర్ మోహన్ డయాబెటీస్ స్పెషాలిటీస్ సెంటర్ - కర్నూలు, డయాబెటిస్ రోగుల ఆరోగ్య సంరక్షణలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తోంది.



రాజకీయంలో రారాజు

మొదటి పేజీ తరువాయి...

గౌరవభావం, నిజాయితీ, సేవా తత్పరత, విలువలతో కూడిన రాజకీయం ఆయన సొంతం. అలాంటి వ్యక్తి ప్రజల మధ్యలో నేడు లేకపోవడం ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. రోడ్డు ప్రమాదంలో అసువులు బాసి నేటికి నాలుగేళ్ళు గడుస్తున్న నేపథ్యంలో మూడవ వర్ధంతి సందర్భంగా ఆయనకు ప్రజలు, అభిమానులు అశ్రునివాళి అర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధం.

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

కలివిడి మనిషి.. రాజవర్ధన్



- బళ్లారి వెంకటరాముడు, టిడిపి నాయకులు సుదిరెడ్డి పల్లె

రాజవర్ధన్ రెడ్డి కలివిడిగా ఉండే మనిషి. అందరితో కలిసిమెలిసి పనిచేసిన వ్యక్తి. మాజీ మంత్రి రాంభూపాల్ చౌదరి, రాజ వర్ధన్ రెడ్డి సమాజం పట్ల మంచి అవగాహన కలిగిన వ్యక్తి అని యువతకు స్ఫూర్తిదాయకంగా ఉన్నాడని, అతనితో ప్రయాణించాలని సూచించారన్నారు. అప్పటినుండి నుండి మా కుటుంబమంతా ఆయనతోనే నడుస్తూ వచ్చాం. నిత్యం సమస్యల పై పోరాడే వ్యక్తి. మాలాంటి వారికి మంచి తోడ్పాటు అందించారు. అలాంటి వ్యక్తిని కోల్పోవడం దురదృష్టకరం. ఆయనకు మా కుటుంబం తరపున ఘన నివాళి.

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

రాజన్న లేని లోటు తీర్చలేనిది



- ఆకెపోగు జయన్న, బి.తాండ్రపాడు సర్పంచి

రాజన్న కుటుంబంలో వ్యక్తుల్లా మమ్మల్ని ఆదరించాడు. ఆయన లేని లోటు తీర్చలేనిది. మా జీవితం రాజన్న కుటుంబానికి అంకితం. పెద్దాయన విష్ణువర్ధన్ రెడ్డికి రాజకీయ వారసునిగా కొనసాగుతూ తనదైన శైలిలో రాజకీయ రూపురేఖలనే మార్చివేసిన గొప్పవ్యక్తి. మచ్చలేని వ్యక్తిత్వం తనది. మనసున్న మారాజు. దళిత బడుగు బలహీన వర్గాల పాలిట ఆపన్న హస్తం. ఎవరు ఎలాంటి సహాయం కోరినా ఎల్లవేళలా తలుపు తెరిచి ఉండే భరోసా ఆయన. అలాంటి వ్యక్తి దూరమయ్యాడని నిత్యం ఆవేదన గుండెల్లో తొలుస్తుంది. ఆయన బాటలో పయనిస్తూ రాజన్న కుటుంబం వెంటే నా పయనం కొనసాగిస్తాను. ఎల్లవేళలా ఆ కుటుంబానికి నేను రుణపడి ఉంటా.

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

వ్యక్తిత్వంలో మహారాజు



- డి.మహమ్మద్ రఫీ, పంచలింగాల టిడిపి నాయకులు

డి రాజ వర్ధన్ రెడ్డి వ్యక్తిత్వంలో మంచి మనసున్న మారాజు. పేద ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి. ఎవరికి ఏ ఆపద వచ్చినా తానున్నానంటూ భుజం తట్టి అండగా నిలిచే వ్యక్తి. ఆయన లేని లోటు తీరనిది. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి.

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

పనులు ఏ ఎమ్మెల్యే కూడా చేయలేదు

- బి.రాంబాబు, యువ నాయకులు గొందిపర్ల



అప్పట్లో ఎంపిపి రాజా వర్ధన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులు నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యే కూడా చేయలేదు. ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్ల ద్వారా పేదలకు రుణాలను మంజూరు చేయించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చారు. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూ సొంత డబ్బులతో క్రికెట్ టోర్నమెంట్లు పెట్టి ప్రోత్సాహం కల్పించారు. ఫైనాన్సు నుండి ఆటోలు ఇప్పించి పేదవారికి ఉపాధి కల్పించారు. సొంత కాళ్లపై నిలబడేలా చేశారు. జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పించారు. ఆయనకు నా ఘన నివాళి.

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

- కె. తిరుమలేష్ గొర్రెల సొసైటీ అధ్యక్షులు

అప్పట్లో ఎంపిపి రాజా వర్ధన్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులు నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యే కూడా చేయలేదు. కోటి రూపాయలతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. ఎస్సి, ఎస్టి, బిసి కార్పొరేషన్ల ద్వారా పేదలకు రుణాలను మంజూరు చేయించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చారు. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూ సొంత డబ్బులతో క్రికెట్ టోర్నమెంట్లు పెట్టి ప్రోత్సాహం కల్పించారు. ఆటోలు ఫైనాన్సు నుండి ఆటోలు ఇప్పించి పేదవారికి ఉపాధి కల్పించారు. సొంత కాళ్లపై నిలబడేలా చేశారు. జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పించారు. ఆయనకు నా ఘన నివాళి.

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

నిబంధనలు బేఖాతరు

- 9 గంటలకే తెర్చుకుంటున్న వైన్ షాపు

ప్రజాశక్తి - ఆస్పరి

వైన్ షాపు నిర్వాహకులు నిబంధనల మేరకు నడుచుకోకపోతే చర్యలు తప్పవని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్నా ఆస్పరిలో నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వైన్ షాపులను నిర్వహించకపోతే సీజు చేస్తామని హెచ్చరిస్తున్నా నిర్వాహకుల్లో ఎలాంటి భయమూ లేదు. ఆస్పరిలో రెండు జనరల్ వైన్ షాపులు, ఒకటి కల్లుగీత కార్మికులకు సంబంధించిన వైన్ షాపు నడుస్తోంది. ఎక్సైజ్ అధికారుల నిబంధనల మేరకు 10 గంటలకు తెరవాల్సిన వైన్ షాపులను నిర్వాహకులు ఉదయం 9 గంటలకే తెరుస్తున్నారు. అప్పటికే వేచి చూస్తున్న మందుబాబులు షాపుల్లో దర్జాగా మందు తీసుకెళ్తున్నారు. నిర్ణీత వేళలకు వైన్ షాపులో పని చేస్తున్న వ్యక్తులు బాటిల్‌పై రూ.10 అదనంగా తీసుకుంటున్నారు.



9 గంటలకే తెరచుకుంటున్న వైన్ షాపులు

మున్సిపల్ విద్యా వ్యవస్థను పునర్నిర్మించాలి

- పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రయివేట్ పాఠశాలలతో పోటీ పడుతూ నిలదొక్కుకుని మనుగడ సాగిస్తున్న మున్సిపల్ విద్యా వ్యవస్థను ప్రభుత్వం పునర్నిర్మాణం చేయాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గం సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్, పట్టణ శాఖ అధ్యక్షులు అనిల్ కుమార్ మాట్లాడారు. చుట్టూ ప్రయివేట్ పాఠశాలలు ఉన్నప్పటికీ, గత 14 ఏళ్లుగా మున్సిపల్ విద్యా వ్యవస్థలో పోస్టులు మంజూరు కాకపోయినా, అరకొర ఉపాధ్యాయులతోనే రాయలసీమలోని చాలా మున్సిపల్ పాఠశాలలు ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా నెగ్గుకొస్తున్నాయని చెప్పారు. 117 ఉత్తర్వులోని మూడు కిలోమీటర్ల పరిధి, నిబంధనల వల్ల మరింత నష్టం జరుగుతోందన్నారు. అలాగే 117కు ప్రత్యామ్నాయ చర్యల్లో భాగంగా మున్సిపల్ పాఠశాలలను డీగ్రేడ్ చేసి, ఇతర యాజమాన్య పాఠశాలల్లో కలపడం మున్సిపల్ విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టు అని విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను నివారించి దశాబ్దం క్రితమే అప్‌గ్రేడ్ అయిన, అప్‌గ్రేడేషన్‌కు నోచని మున్సిపల్ పాఠశాలలకు స్టాఫ్ ప్యాటన్ ప్రకారం ఈసారైనా పాఠశాల సహాయకుల, ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేసి, మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు జంగం బసవరాజు, కోటన్న, చంద్రమౌళి, నూరుల్ హక్, ప్రతాప్ రెడ్డి, ఆనంద్, బడుగు బసవరాజు, మద్దయ్య, చంద్ర శేఖర్ శర్మ, భాస్కర్ ఆచారి, చంద్రశేఖర్ ఉన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఉపాధ్యాయులు

రోడ్డుకు అడ్డంగా ఉన్న గోడను తొలగించాలని వినతి

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డుకు అడ్డంగా ఉన్న గోడను తొలగించాలని బాధితుడు ఈడిగ ఈరన్న కోరారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎస్.రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ... మండలంలోని మాధవరం గ్రామంలో



గోపాల కృష్ణ ద్వారా అక్టోబర్ 6, 2020లో సర్వే నెంబరు 442లో గల ప్లాటు నెంబర్ 5ను కొనుగోలు చేసినట్లు తెలిపారు. తన ప్లాటు పక్కనే ఎర్రగొట్ల నర్సన్న అనే వ్యక్తి కూడా కొనుగోలు చేశారని, ఇద్దరికీ తూర్పు దిక్కున ఉన్న రోడ్డుకు గోడ కట్టారని చెప్పారు. తాను ఒంటరి వాడినని దౌర్జన్యం చేస్తున్నారని పేర్కొన్నారు. కట్టిన గోడ కారణంగా డ్రెయినేజీ నీరు పోకుండా నిలవడం వల్ల దుర్వాసనతో పాటు ఈగలు, దోమలు పెరిగి సమీపంలో ఉన్న 20 కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరో వ్యక్తి బొమ్మిశెట్టి నాగరాజు కూడా ఇబ్బందులు పడుతున్న వ్యక్తులతో కలిసి వినతిపత్రం సమర్పించామని చెప్పారు. వెంటనే చర్యలు చేపట్టి గోడను తొలగించి న్యాయం చేయాలని కోరారు.

ఆదర్శనేత... నిత్యం జ్ఞప్తికి వస్తుంటాడు



- నెవ్రూహ ,టిడిపి యువనాయకుడు

రాజ వర్ధన్ రెడ్డి చిన్న వయసులోనే మా మీద తనదైన ముద్ర వేశారు. ఆదర్శ నేతగా ఉంటూ ఆదర్శ రాజకీయాలు చేస్తూ, నిత్యం ప్రజల సమస్యలపై స్పందించడం, పరిష్కారం చేయడం నిత్యం మా కళ్ల ముందే ఉంటున్నాయి. ఆయన చనిపోయి మాలో జీవిస్తున్నారు.

స్నేహశీలి ..ముందు చూపున్న నేత...

- ప్రకాష్ రెడ్డి, టిడిపి నాయకులు, నిడ్జూరు



గొప్ప స్నేహశీలి, కార్యకర్తలకు అండగా నిలబడే మనిషి, మనుషులందరూ బాగుండాలనే తపన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయుడు రాజ వర్ధన్‌రెడ్డి. చిన్న ప్రాయంలోనే చనిపోవడం నియోజకవర్గ ప్రజల దురదృష్టం. నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక దృఢ సంకల్పం ఉన్న నేత. చిన్న ప్రాయంలోనే చనిపోవడం అత్యంత బాధాకరం. ఆయనను స్మరించుకుంటూ అందరిలో జీవించేలా కార్యక్రమాలు చేపడతాం. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని 20వ తేదీ జిల్లా పరిషత్ ప్రాంగణంలో అన్నదానం చేస్తున్నం.



40 ఏళ్లుగా ప్రజాసేవలో కృష్ణ యాదవ్

-వామపక్ష ఉద్యమం నుంచి టిడిపి వరకు రాజకీయ ప్రస్థానం
- పంచలింగాల గ్రామంలో ఉచిత సేవలు
- రాజా వర్ధన్ రెడ్డితో అనుబంధం, ఆయన ఆశయాల కొనసాగింపు
-విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో టిడిపి అభివృద్ధి



కర్నూలు మండలంలో బలమైన టిడిపి నాయకుడిగా, ప్రజల మనిషిగా, విష్ణువర్ధన్ రెడ్డి అనుచరుడిగా కృష్ణ యాదవ్ సుపరిచితులు. 40 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్న ఆయన, 18 ఏళ్ల వయసు నుంచే సమాజంలోని అన్యాయాలపై పోరాడుతున్నారు. వామపక్ష ఉద్యమంతో రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, కార్మికుల పక్షాన పోరాడారు. ఆ తర్వాత టిడిపిలో చేరి, కర్నూలు మండలంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. పంచలింగాల గ్రామంలో నిత్యం ప్రజలకు సేవలందిస్తూ, వారి మన్ననలు పొందారు. గ్రామంలో ఉచిత అంబులెన్స్ సేవలు, 300 మందికి ఉచిత విహారయాత్రలు ఏర్పాటు చేశారు. ఆయన సేవలను గుర్తించిన ప్రజలు, ఆయనను ఎంపిటిసిగా, ఆయన భార్య మాధవిలతను సర్పంచిగా ఎన్నుకున్నారు. కోడుమూరు మాజీ ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డికి సన్నిహితుడిగా, ఎంపీ బస్తిపాటి నాగరాజు సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

రాజవర్ధన్ రెడ్డితో అనుబంధం: రాజవర్ధన్‌రెడ్డితో తన అనుబంధాన్ని కృష్ణ యాదవ్ గుర్తు చేసుకున్నారు. ఆయన అగ్రకుల ఆధిపత్యం, అసమానతలపై పోరాడాలని చెప్పారని, సుందరయ్యను స్ఫూర్తిగా తీసుకున్నారని తెలిపారు. రాజవర్ధన్ రెడ్డి మరణం తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. విష్ణువర్ధన్‌రెడ్డి కార్యకర్తలను సొంత కొడుకుల్లా చూసుకుంటున్నారని, కోడుమూరు నియోజకవర్గంలో టిడిపి జెండాను ఎగురవేస్తున్నారని పేర్కొన్నారు.



ఆ కుటుంబంతో 40 ఏళ్ల అనుబంధం

మా ఊరి నుండే ఎంపిపిగా రాజా ఎన్నికయ్యారు

అల్లీపీరా గార్గేయపురం



విష్ణువర్ధన్ రెడ్డి కుటుంబంతో 40 ఏళ్లుగా మాకు అనుబంధం ఉంది. మా వార్డు నుండే 700 ఓట్లతో ఎంపిటిసిగా గెలిచి ఎంపిపిగా ఎన్నికయ్యారు. అది మాకు ఎనలేని సంతోషం ఇచ్చే విషయం. ఆయన ఎన్నికైన తర్వాత మా ఊరిలో చాలా పనులు చేశారు. గార్గేయపురం చెరువు నుండి పైప్‌లైన్ ద్వారా ఊరు మొత్తానికి తాగునీటి సమస్యను పరిష్కారం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పొలాలకు దారి సమస్య ఉంటే దానిని పరిష్కారం చేశారు. ఉచిత మినరల్ వాటర్‌ను ఏర్పాటు చేశారు. సిసి రోడ్లు వేశారు. ఆయన చిన్న వయసులో చనిపోవడం అత్యంత బాధాకరం మా కుటుంబానికి కూడా తీరని లోటు.

ప్రజల మనిషి రాజవర్ధన్ రెడ్డి

నాగరాజు ఎంపిటిసి



మాజీ ఎంపిపి డి రాజ వర్ధన్ రెడ్డి ఎస్‌సి, ఎస్‌టి, బిసి కార్పొరేషన్ల ద్వారా పేదలకు రుణాలను మంజూరు చేయించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించి గ్రామ ప్రజల దాహార్తిని తీర్చారు. యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తూ సొంత డబ్బులతో క్రికెట్ టోర్నమెంట్లు పెట్టి ప్రోత్సాహం కల్పించారు. ఆటోలు ఫైనాన్సు నుండి ఆటోలు ఇప్పించి పేదవారికి ఉపాధి కల్పించారు. సొంత కాళ్లపై నిలబడేలా చేశారు. జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పించారు. ఆయనకు నా ఘన నివాళి.



రాజవర్దన్‌రెడ్డితో చక్కటి అనుబంధం



టి .వెంకటేశ్వర్లు ఎంపిటిసి భర్త, ఈ తాండ్రపాడు

రాజ వర్ధన్‌రెడ్డి ఎంపిపిగా ఉన్నప్పటి నుంచి ఎంతో అనుబంధం ఉండేది. ప్రజలకు కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కారానికి కృషి చేసేవాడు. వరదల కారణంగా మూలమడుగు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చేది. రూ. కోటి వెచ్చించి బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. గ్రామా భివృద్ధిలో ఇదో మైలు రాయి. ఏ ఆపద వచ్చినా అండగా నిలబడే వాడు పేదలకు పెళ్లిళ్లు, టిడిపి కార్యకర్తలకు ఆర్థికసాయం వంటి అనేక సేవా కార్య క్రమాలు నిర్వహించే వారు. ఆయన్నుప్పుడు గ్రామంలో 150 ఇల్లు నిర్మించాం కుంట పూడిక పనులు చేపట్టాం. ఆయన లేని లోటు తీరనిది.







